క్లుప్తంగా

కార్తీక వనభోజనాలు



కార్తీక వనభోజనాల్లో పాల్గొన్న ఎల్డర్స్ క్లబ్ సభ్యులు

కావలి: కావలి ఎల్డర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు సోమవారం సందడిగా నిర్వహించారు. ఎల్డర్స్ క్లబ్ ఇంటర్నేషనల్‌కు అనుబంధంగా ఐదేళ్ల క్రితం కావలిలో స్థాపించిన ఎల్డర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కులమతాలకు అతీతంగా కార్తీక వనభోజనాలు, వినోద కార్యక్రమాలు, ఆటల పోటీలు సందడిగా సాగాయి. కావలి చెరువు సమీపంలోని లక్ష్మీనరసింహా స్వామి ఆలయానికి చేరువలో ఉన్న వనంలో నిర్వహించిన ఈ వేడుకలు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి. అనంతరం సమీపంలోని గిరిజన కాలనీలో అన్నదానం, వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు జేబీఎం నాయుడు, గౌరవాధ్యక్షుడు దుగ్గిశెట్టి బాలయ్య, ఉపాధ్యక్షుడు గోపీకృష్ణ, శారద, కోశాధికారి విద్యాసాగర్, కార్యవర్గ సభ్యులు పార్వతీశంకర్, విద్యావతి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న అధికారులు

జలదంకి: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ బత్తిన సింగయ్య తెలిపారు. సోమవారం మండలంలోని జమ్మలపాళెంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉజ్వల్ యోజన, ఆయుష్మాన్ భారత్ యోజనను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ యోజన హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. అర్హులైన వారికి ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుర్రి శ్రీవేణి, హౌసింగ్ ఏఈ ప్రసాద్, ఏఓ శైలజ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిమెంట్ ట్యాంకర్ ఢీకొని వ్యక్తికి గాయాలు



క్షతగాత్రుడిని 108లో తరలిస్తున్న దృశ్యం

మర్రిపాడు: సిమెంట్ ట్యాంకర్ బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మర్రిపాడు మండలం నెల్లూరు- ముంబయి జాతీయ రహదారిపై నందవరం కూడలి, డీసీపల్లి మార్గ మధ్యంలో సోమవారం జరిగింది. పొంగూరుకు చెందిన వ్యక్తి నందవరం మోడల్ స్కూల్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రమాదానికి కారణమైన లారీ ఆపకుండా వెళ్లిపోవడంతో నందవరం మోడల్ స్కూల్ సిబ్బంది నందవరం కూడలి వద్ద అడ్డుకుని నిలిపివేశారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

రెడ్‌క్రాస్ చేయూత

జలదంకి: మండలంలోని చోడవరంలో జాజుల మహాలక్ష్మమ్మ ఇల్లు ఇటీవల తుఫాను కారణంగా దెబ్బతినడంతో ఆ కుటుంబానికి జలదంకి రెడ్‌క్రాస్ శాఖ చేయూత అందించింది. సోమవారం జలదంకి రెడ్‌క్రాస్ అధ్యక్షుడు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి చోడవరంలోని బాధిత కుటుంబాన్ని పరామర్శించి వర్షపు నీరు పడకుండా దృఢమైన పట్టను, హైజెనిక్ కిట్టును ఆ కుటుంబానికి అందించారు.

ఆలయ నిర్మాణం, పర్యాటకాభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే మేకపాటి
- సోమేశ్వరాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



నాయకులు, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి

సోమశిల: ఎంతో చరిత్రాత్మకమైన సోమశిలలోని సోమేశ్వరాలయ పునర్నిర్మాణంతో పాటు పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. సోమవారం సోమశిల జలాశయం సమీపంలోని సోమేశ్వర దేవాలయాన్ని సందర్శించి దేవాలయ మరమ్మతుల పనులను పరిశీలించారు. అంతకు ముందు కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గతంలో వచ్చిన వరదల కారణంగా దెబ్బతిన్న ఆలయాన్ని పునర్నిర్మించేందుకు రూ.10 కోట్లు అవసరమన్నారు. ప్రస్తుతం రూ.2 కోట్లు విడుదల చేయడంతో గాలిగోపురం నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. దేవాలయ నిర్మాణంతో పాటు సోమశిల జలాశయం పరిసర ప్రాంతాలు పర్యాటకులను ఆకర్షించే విధంగా ఇక్కడ మౌలిక వసతుల కల్పనకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఇందు కోసం సుమారు రూ.25 కోట్లు అవసరం కావడంతో దేవదాయశాఖ, ప్రభుత్వ ఇతర నిధుల నుంచి సమీకరించేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తామన్నారు. ఆయన వెంట ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు ఉప్పల విజయ్‌కుమార్, సోమసుందరమూర్తి, ఆలయ అర్చకులు రామకృష్ణశర్మ, ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, వైఎస్సార్‌సీపీ నేత ఊరిబిండి ప్రభాకర్ రెడ్డి, జెడ్పీటీసీ పీర్ల పార్థసారథి, ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఏఎస్‌పేట జెడ్పీటీసీ పందిళ్లపల్లి రాజేశ్వరమ్మ, ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడా కిట్‌లు అందజేస్తున్న మేకపాటి రాజారెడ్డి

దుత్తలూరు: క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా కిట్లను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి వినూత్న పథకాల ద్వారా రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు చేకూరుస్తున్నారన్నారు. దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోయాడన్నారు. క్రీడలకు ఉండే ప్రాధాన్యత ప్రజలకు వివరించాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయి వరకు వెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎంపీడీఓ సాయిప్రసాద్, జేసీఎస్ మండల కన్వీనరు అన్నంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబరు దొంతిరెడ్డి నరసింహారెడ్డి, నాయకులు ఎల్‌పీ కొండారెడ్డి, యనమల వెంగయ్య, సింగవరపు గంగాధర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ గ్రామోత్సవం



పోలేరమ్మ తల్లి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

సంగం: మండలంలోని సిద్ధీపురంలో పోలేరమ్మ తల్లికి సోమవారం వైభవంగా జాతర మహోత్సవాన్ని నిర్వహించారు. పోలేరమ్మ తల్లి ఉత్సవమూర్తిని భారీ గజమాలలతో విశేషంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. పోలేరమ్మ తల్లికి భక్తులు నారీకేళాలు, నైవేద్యాలు సమర్పించారు.

పేద ప్రజలకు వెన్నుదన్నుగా కేంద్ర ప్రభుత్వం



వికసిత్ సంకల్ప యాత్రలో మాట్లాడుతున్న కంది మల్లికార్జునరెడ్డి

మర్రిపాడు: పేద ప్రజల ఆర్థిక అభ్యున్నతికి కృషి చేస్తూ వెన్నుదన్నుగా కేంద్ర ప్రభుత్వం నిలబడుతుందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కంది మల్లికార్జునరెడ్డి అన్నారు. మండలంలోని పొంగూరులో ఎంపీడీఓ నాగమణి ఆధ్వర్యంలో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న కేంద్ర ప్రభుత్వం పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఆయుష్మాన్ భారత్ కార్డులు ప్రధాన మంత్రి ఉజ్వల్ గ్యాస్ కనెక్షన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలు ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, బీజేపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి మరింత ప్రోత్సాహం

- ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



యువతతో ఎమ్మెల్యే మేకపాటి

మర్రిపాడు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని, ఆయన స్ఫూర్తితో క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి అన్నారు. మండలంలోని కదిరినాయుడుపల్లికి చెందిన యువత తమకు క్రికెట్ కిట్ అందజేయాలని ఎమ్మెల్యేను కోరడంతో సోమవారం సాయంత్రం ఏడీఎఫ్ సౌజన్యంతో బ్రాహ్మణపల్లిలోని తమ నివాసంలో వారికి క్రికెట్ కిట్ అందజేశారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ అనేక క్రీడల్లో దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న వారంతా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వారేనన్నారు. యువత క్రీడలపై మరింత ఆసక్తి పెంచుకుని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆడుదాం ఆంధ్ర ఆట స్థలాలు సిద్ధం

ఆత్మకూరురూరల్: 'ఆడుదాం ఆంధ్ర'లో భాగంగా క్రీడా పోటీలు నిర్వహించే ఆట స్థలాలను అవసరమైన ఏర్పాట్లతో సిద్ధం చేశామని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. మండలంలోని మహిమలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో క్రీడా ప్రాంగణాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ క్రికెట్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ తదితర ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. ఔత్సాహిక క్రీడాకారులు ఈ ఆటల పోటీల్లో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ పట్టెడ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి పల్లవోలు భాస్కర్, జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, పీఈటీ పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర కిట్ల పంపిణీ

సోమశిల: ఈ నెల 15వ తేదీ నుంచి మండలంలో జరగనున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు సంబంధించి క్రీడా కిట్లను సోమవారం ఎంపీడీఓ ఏ మధుసూదన్‌రావు పంచాయతీ కార్యదర్శులకు పంపిణీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ 19 రకాల క్రీడా సామగ్రి అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-1 బాలకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

నంది నాటకోత్సవాల జ్యూరీ సభ్యుడిగా మల్లేశ్వరరావు



కావలి: నంది నాటకోత్సవాల జ్యూరీ సభ్యుడిగా ఎట్టణానికి చెందిన నాటక రచయిత, దర్శకులు ఏవీ మల్లేశ్వరరావును ప్రభుత్వం నియమించింది. గుంటూరు నగరంలోని విజ్ఞాన్ కళామందిర్‌లో ఈ నెల 23 నుంచి 29వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం నంది నాటకోత్సవాలు నిర్వహించనుంది. ఈ పోటీలకు సంబంధించి ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోసాని కృష్ణమురళి ఆధ్వర్యంలో విజయవాడలో సోమవారం నిర్వహించిన జ్యూరీ సమావేశంలో మల్లేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. పట్టణానికి చెందిన ఏవీ మల్లేశ్వరరావు నాలుగు దశాబ్దాలుగా నాటక రచయితగా, దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపును పొందారు.

మద్యంతాగి వాహనాలు నడిపితే చర్యలు

చేజర్ల: మద్యం తాగి వాహనాలు నడిపితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ప్రాంతీయ రవాణాశాఖాధికారి చందర్ అన్నారు. సోమవారం చేజర్ల మండలం ఆదూరుపల్లిలో ఆత్మకూరు ఎంవీఐ రాములుతో కలిసి పలు వాహనాలను తనిఖీ చేశారు. స్కూలు వ్యాన్లు, కార్లు, బైక్‌లు తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారు నడిపే వారు సీటు బెల్ట్ పెట్టుకోవాలన్నారు. తనిఖీ సమయంలో అధికారులకు వాహనానికి సంబంధించిన పత్రాలు చూపించాలన్నారు.

జొన్నలో కత్తెర పురుగు



పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

చేజర్ల: మండలంలోని చేజర్ల, చిత్తలూరు గ్రామాల్లో సాగులో ఉన్న పంటలను జిల్లా వనరుల కేంద్రం అధికారులు సోమవారం పరిశీలించారు. ఆ గ్రామాల్లో ఉన్న జొన్న, శనగ, మినుము, దెబ్బతిన్న వరి నారు మడులను పరిశీలించి కొన్ని సూచనలు చేశారు. జొన్నలో కత్తెర పురుగు ఉన్నట్లు గుర్తించి, నివారణకు ఇమామెక్టిన్ బెంజాయేట్ 120 గ్రాములు గాని, బారాజైడ్ 400 గ్రాములు కలిపి ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. మినుములో ఎదుగుదల కోసం నీటిలో కరిగే 19:19:19 పొడిని 10 గ్రాములు ఒక లీటర్ నీటికి, ఫార్ములా- 4ను 2.5 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మారుతీదేవి, ఏఓ శైలజా కుమారి, కేవికే శాస్త్రవేత్త నాయక్, వ్యవసాయ శాఖాధికారి శశిధర్, వీఏఏలు కిరణ్, మాధురి, మమత, రైతులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..



కృష్ణారెడ్డిపాళెంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న రవీంద్రారెడ్డి

కలిగిరి: నాలుగున్నరేళ్లలో రెండేళ్లు కరోనా విపత్తుతో రాష్ట్రం ఎంతో నష్టపోయినా.. సంక్షేమ పథకాలతో పాటు దశాబ్దాలుగా పీటముడి పడిన అనేక సమస్యలను ఒక్క సంతకంతో ప్రజల అవసరాలు, బాధలు, కష్టాలు తీర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడ కాటం రవీంద్రారెడ్డి అన్నారు. మండలంలోని కృష్ణారెడ్డిపాళెంలో సోమవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కుల మతాలు, పార్టీలకతీతంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించారన్నారు. సంక్షేమ పథకాలతో పాటు ప్రభుత్వ వ్యవస్థల్లో అనేక సంస్కరణలు తీసుకువచ్చి ప్రజలకు పాలన చేరువ చేశారన్నారు. మరో వైపు దశాబ్దాలుగా పీటముడి పడిన చుక్కల భూముల సమస్యకు పరిష్కారం చూపారన్నారు. అసైన్‌మెంట్ భూములకు శాశ్వత హక్కు పట్టాలు ఇచ్చారన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులోకి తెచ్చారన్నారు. 2024 ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. పలువురు లబ్ధిదారులకు అసైన్‌మెంట్ భూములకు శాశ్వత పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వెలుగోటి మధు, సర్పంచ్ నలతాటి మహాలక్ష్మమ్మ, స్థానిక నాయకులు నలతాటి యాదగిరి, రావుల లక్ష్మీనారాయణరెడ్డి, చుండి మనోహర్, చుండి వెంగళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే పేదలకు మేలు



సంక్షే పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న నాయకులు

అల్లూరు: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని వెస్ట్ బ్యాంక్ చైర్మన్ బత్తల మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం అల్లూరు-1 సచివాలయంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులతో కలిసి ఇంటింటా తిరిగి నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామ సచివాలయాల పరిధిలో కోట్ల రూపాయలు లబ్ధిదారులకు అందినట్లు తెలిపారు. పార్టీ శ్రేణులంతా ప్రభుత్వ సంక్షే పథకాలు, అభివృద్ధి కార్యక్రాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నిమ్మల భాస్కర్, మనోహర్, ఓ వెంకటేశ్వర్లు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ సాయం అందజేత



ఆత్మకూరు: తుఫాన్ బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న కౌన్సిలర్



గిరిజనులకు నగదు అందజేస్తున్న అధికారులు, నాయకులు

ఆత్మకూరు: తుఫాన్ భారీ వర్షాలకు పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో ఇబ్బందులు పడిన బాధితులకు ప్రభుత్వ సాయం ప్రకటించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా 7వ వార్డు పరిధిలో సుమారు 30 కుటుంబాలకు కౌన్సిలర్ సయ్యద్ నౌషాద్‌బేగం, సచివాలయ అడ్మిన్ సురేంద్ర ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, బియ్యం పంపిణీ చేశారు.

తుఫాన్ బాధితులకు ఆర్థిక సాయం

కలిగిరి: కలిగిరి పంచాయతీ వెంకనపాళెం ఎస్టీ కాలనీలో ఇటీవల తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన 9 గిరిజన కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2500 చొప్పున ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయాన్ని సోమవారం పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కాటం రవీంద్రారెడ్డి మాట్లాడుతూ మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం త్వరితగతిన పరిహారం అందించడానికి చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీరామకృష్ణ, డీటీ మురళీధరరాజు, ఉపసర్పంచ్ పాలూరి కొండారెడ్డి, వీఆర్వో చినరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతం



సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

ఆత్మకూరు: కార్తీక మాసం సోమవారం పురస్కరించుకుని పట్టణంలోని కోదండ రామాలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. అర్చకులు జగర్లపూడి సుబ్రహ్మణ్యం శర్మ మహిళలతో ఈ వ్రతాన్ని ఆచరింప చేశారు. తొలుత ఆలయంలో సీతారాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

హరహర మహాదేవా..

- హోరెత్తిన శివనామస్మరణ



సంగమేశ్వరాలయంలో పండ్లతో ఏర్పాటు చేసిన భారీ శివలింగం

సంగం: కార్తీక మాస చివరి సోమవారం శైవక్షేత్రాలు హరహర మహాదేవా.. శంభో శంకరా శివనామ స్మరణతో పులకించాయి. సంగం తిరుమనకొండలో కొలువైన కాశీవిశ్వేశ్వరుడికి సోమవారం తెల్లవారుజాము నుంచే ఆలయానికి విచ్చేసిన భక్తులు జలం, క్షీరంతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో యజ్ఞం నిర్వహించి లక్ష దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు ఉసిరి చెట్టు కింద వనభోజనాలు చేశారు. దువ్వూరు గంగాపార్వతి సమేత కోటేశ్వరుడికి, వంగల్లు భీమేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు వెలిగించిన కార్తీక దీపాలు దేదీప్యాంగా వెలుగొందాయి.

మైమరిపించిన భారీ ఫల శివలింగం

త్రివేణి సంగమం ఒడ్డున వెలసిన సంగమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి వివిధ రకాల ఫలాలతో చేసిన భారీ శివలింగం భక్తులను తన్మయత్వంతో మైమరిపించింది. వివిధ రకాల పండ్లతో భారీ శివలింగం ఆకృతి చుట్టూ భక్తులు 365 ఒత్తులతో అత్యంత భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. పెన్నానదిలో సైతం సోమవారం సాయంత్రం భక్తులు కార్తీక దీపాలు వెలిగించి వదిలారు. సంగమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి భారీగా మహిళలు వెలిగించిన కార్తీక దీపాలు మిరిమిట్లుగొలిపాయి.

కమనీయం.. కల్యాణం

సంగమేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి కామాక్షిదేవి సంగమేశ్వరస్వామి కల్యాణం కమనీయంగా జరిగింది. ఆలయంలోని కామాక్షిదేవి, సంగమేశ్వరస్వామి ఉత్సవమూర్తులను వధువరూలుగా అలంకరించారు. వేద పండితులు వేద మంత్రోచ్చారణలు, భాజాభజంత్రీలు, భక్తుల నడుమ కల్యాణం వైభవంగా నిర్వహించారు.

శివాలయంలో విశేష పూజలు

ఆత్మకూరు: పవిత్ర కార్తీక మాసం చివరి సోమవారం పట్టణంలోని శివాలయంతో పాటు పలు ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరాలయంలో తెల్లవారుజాము నుంచే స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కార్తీక సోమవారం ఉపవాసాలు ఉండి సాయంత్రం ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకుని నక్షత్ర దర్శనం అనంతరం ఉసిరి చెట్ల కింద భోజనాలు చేశారు.

వైభవంగా కార్తీక దీపాలు

చేజర్ల: కార్తీక మాసం సోమవారం కావడంతో మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కోటితీర్థంలో కొలువైన కోటేశ్వరాలయంలో ఉపవాస దీక్షలో ఉన్న మహిళలు పక్కనే ఉన్న పవిత్రమైన పెన్నానదిలో స్నానాలాచరించి పూజలు నిర్వహించారు. మహిళలు సాయంత్రం కార్తీక దీపాలు వెలిగించి ఉపవాస దీక్షను విరమించారు.

ఘనంగా కార్తీక పూజలు

దుత్తలూరు: కార్తీక మాసం చివరి సోమవారం మండలంలోని శివాలయాలు శివన్నామస్మరణతో మార్మోగాయి. దుత్తలూరు సంజీవకొండపై కొలువైన రామలింగేశ్వర స్వామిని అర్చకులు పంచామృతాలతో అభిషేకించి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపేట, నర్రవాడ, నందిపాడు శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఉపవాసం ఉండి కార్తీక దీపాలు వెలిగించారు.



కాశీ విశ్వేశ్వరుడికి అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

పుణ్యక్షేత్రాల్లో మేకపాటి దంపతుల ప్రత్యేక పూజలు

సీతారామపురం: నెల్లూరు, ప్రకాశం జిల్లాల సరిహద్దులోని భైరవకోన, సీతారామపురం మండలం సిద్ధేశ్వరంలో ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆయన సతీమణి శ్రీదేవి సోమవారం ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత భైరవకోనలో ఒకే రాతిలో మలచిన అష్టదేవాలయం వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం సిద్ధేశ్వరంలో శివుడికి, ఇష్ట కామేశ్వరి, కాశీనాయన ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరి వెంట శేషారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు తిరుపాలు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాణెం రమణయ్య, జేసీఎస్ మండల కన్వీనరు బాలినేని మాబయ్య తదితరులు ఉన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



భైరవకోనలో పూజలు నిర్వహిస్తున్న మేకపాటి రాజారెడ్డి దంపతులు



చేజర్ల: కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



ఆత్మకూరు: కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు